క్లుప్తంగా

అన్నదానం



కడప అర్బన్: హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన ఈశప్ప బాదుర్, అనితల వివాహం సందర్భంగా కడప నగరంలోని బృందా వృద్ధాశ్రమంలో వారికి శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హిమవర్షిణి ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, దామోదర్, ఎలక్ట్రిషన్ మధు పాల్గొన్నారు.

లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: యోగి వేమన విశ్వ విద్యాలయంలో లా డిపార్టుమెంట్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా వీరణాల శివకుమార్ తెలిపారు. సీపీఎం కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ వైవీయూ పరిధిలోని న్యాయ విద్యా కళాశాలలో ఏటా నాలుగు వేలమంది మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ, ఐదు సంవత్సరాల బీఏ ఎల్ఎల్‌బీ అభ్యసిస్తున్నారన్నారు. ఎగ్జామ్స్, సెమిస్టర్ పరీక్షల నిర్వహణ యూనివర్సిటీ తాత్కాలిక ఇన్‌ఛార్జిలకు భారం అవుతోందన్నారు. కడప జిల్లాలో న్యాయ విద్యకు ప్రత్యేకం విభాగం ఏర్పాటుచేసి నిర్దిష్ట అకడమిక్ క్యాలెండర్ ద్వారా సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. కడప జిల్లా నుంచి న్యాయ విద్యలో పీజీ చేయాలంటే పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో గ్రంథాలయాలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న డాక్టర్ జీవీ.సాయిప్రసాద్

కడప కల్చరల్: భారత స్వాతంత్య్రోద్యమంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ ఎ.చంద్రశేఖరెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గాడిచర్ల అటు స్వాతంత్య్ర ఉద్యమం, ఇటు గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్లు బాబ్జి, సుబ్రహ్మణ్యం రాజ్ కుమార్, శ్రీనివాసాచార్, మనోహర్ పాల్గొన్నారు.

డిసెంబరు 1న బలిజల వన మహోత్సవం

కడప కల్చరల్: కార్తిక మాసం సందర్భంగా డిసెంబర్ 1న ఆదివారం బలిజల వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నామని బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలినాల శ్రీనివాసులు, కార్యదర్శి మాదరాసు రెడ్డెయ్య ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ ఎదురుగా మామిడి వనంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యేమీ కార్యక్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు వన భోజనం ఉంటుందన్నారు.

ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి చేద్దాం

– జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరావు



మాట్లాడుతున్న అయితా నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు సూచించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ సేద్య కార్యాలయంలో జరిగే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచనలు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రసాయన ఉత్పత్తులు తిని వందకు 70 మంది రోగాల బారినపడుతున్నారన్నారు. పురుగుముందు లేని వ్యవసాయాన్ని చేపట్టేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్రామీణులకు మానసిక ధృఢత్వం ఉండాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, దినేష్ అన్నారు. రామరాజుపల్లె కోలాటం కళాకారులకు దుస్తులు ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల నుంచి నేర్చుకుంటున్న కోలాటం ప్రదర్శనకు అవసరమైన బాలుర టీ షర్టులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పల్లె నుంచి.. జాతీయ స్థాయికి

మొబైల్‌ఫోన్ పక్కన పెట్టి నెట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకున్నారు అమ్మాయిలు. చదువుల్లో రాణిస్తూనే క్రీడల్లోనూ పట్టు సాధిస్తున్నారు. నెట్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి భళా అనిపిస్తున్నారు చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు. చత్తీస్‌గఢ్, పంజాబ్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు నుంచి ఆడేందుకు సన్నద్ధమవుతున్నారు.

- నెట్‌బాల్‌లో రామనపల్లె బాలికల సత్తా
- నేషనల్స్‌కు నలుగురు క్రీడాకారిణులు



నెట్‌బాల్ ఆడుతున్న రామనపల్లె జెడ్పీ హైస్కూల్ క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు నెట్‌బాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు కె.రెడ్డయ్య వద్ద శిక్షణ తీసుకని జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14 నెట్‌బాల్ బాలికల పోటీల్లోనూ, ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్–17, అండర్–19 రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ చక్కటి ఆట తీరుతో గ్రామీణ బాలికలు ఆకట్టుకున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచిన యు.వెంకటశృతి చత్తీస్‌గడ్‌లోని కోబ్రాలో నవంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. వారితోపాటు అండర్–17 విభాగంలో వై. సందీప్, అండర్–19 విభాగంలో పి.చక్రి, టి.నిషా నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మా జట్టును విజయపథంలో నడిపిస్తా



ఏపీ జట్టును జాతీయ స్థాయిలో విజయపథంలో నడిపించేందుకు కృషి చేస్తా. పంజాబ్‌లోని లుధియానాలో డిసెంబర్ 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–17 జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉంది. మరో నెల రోజుల సమయం ఉండటంతో శిక్షణ తీసుకుంటూ సాధన చేస్తున్నా.

– వై. సందీప్, 10వ తరగతి

క్రీడల్లో ప్రత్యేకత చాటి చెబుతాం..



జిల్లాలో నెట్‌బాల్ క్రీడలో మా పాఠశాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఫిజికల్ డైరెక్టర్ రెడ్డయ్య సార్ శిక్షణలో అందరం మంచి ఆటతీరు కనబరుస్తున్నాం. ఎస్‌జీఎఫ్ఐ నేషనల్స్‌లో పాల్గొనే అండర్–19 జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మా పాఠశాలతోపాటు, పాఠశాల ప్రత్యేకతను చాటి చెబుతాం.

– పి. చక్రి, 10వ తరగతి

మూడో స్థానంలో నిలిచాం.



వైఎస్సార్ కడప జిల్లా జట్టు చక్కటి ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో మూడోస్థానంలో నిలవడం మాకెంతో సంతోషాన్నిచ్చింది. ఉత్తమ ఆటతీరును కనబరచడంతో నాకు నేషనల్స్‌లో పాల్గొనే అవకాశం లభించింది. త్వరలో ఏపీ జట్టు నుంచి కోబ్రాలో నిర్వహించే నేషనల్స్‌లో పాల్గొనబోతున్నా. ఇందుకోసం నిత్యం వ్యాయామం చేస్తూ సాధన చేస్తున్నా.

– యు.వెంకటశృతి, 8వ తరగతి

రోజూ సాధన చేస్తాం



రామనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో రోజూ నెట్‌బాల్ సాధన చేస్తాం. రాష్ట్ర స్థాయిలో నెట్‌బాల్ క్రీడల్లో మా పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నేను గతంలోనూ అండర్–14 విభాగంలో ఆడాను. తాజాగా అండర్–19 విభాగంలో ఏపీ జట్టుకు ఎంపికయ్యాను. పంజాబ్‌లోని లుధియానాలో నిర్వహించే నేషనల్స్‌లో పాల్గొనే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– టి.నిషా, 8వతరగతి

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: పెద్ద దర్గా ఉరుసు వేడుకల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. మాచుపల్లి బస్టాండును శనివారం ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ×మన కడప– మన రుచులు– మన కలలు€ కార్యక్రమంలో భాగంగా ఆహారు రుచులపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని, కడప ప్రత్యేకతలు, స్థానిక సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. అనంతరం అమీన్ పీర్ దర్గాను కమిషనర్ పరిశీలించారు. ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం..దేశానికి సౌభాగ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: పిల్లల ఆరోగ్యమే దేశానికి సౌభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమం ప్రారంభించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ పరీక్షల్లో విద్యార్థులకు అనారోగ్య సమస్యలుంటే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. తద్వారా ఉచిత వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, రక్త హీనత, చర్మ వ్యాధులు, చెవి, దంత సమస్యలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ సందర్భంగా లైబ్రరీ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డాక్టర్ అనూష, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. కడప నగరంలోని పీఎస్‌యూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తున్నా.. ప్రభుత్వం మెస్ ఛార్జీలు విడుదల చేయలేదన్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశన్నంటుంతున్న నేపథ్యంలో ప్రతి నెలా వార్డెన్లు అప్పుచేసి హాస్టళ్ల నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. ప్రతి విద్యార్థికి బెడ్ షీట్, మూడు జతల దుస్తులు, ప్లేట్లు, పెట్టెలు, బక్కెట్, మగ్ అందివ్వాలన్నారు. సమస్యలపై స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నరసింహ, రామ్‌చరణ్, అనిల్, రవీంద్ర, పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు మాణిక్యరావు సేవలు ఎనలేనివి



స్కాలర్‌షిప్ అందజేస్తున్న అతిథులు

వైవీయూ: ఎయిడెడ్ విద్యా సంస్థల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ ఎం.జె. మాణిక్య రావు సేవలు ఎనలేనవిని విశ్రాంత ప్రిన్సిపల్ అల్లం సత్యనారాయణ అన్నారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మాణిక్యరావు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో అల్లం సత్యనారాయణ మాట్లాడుతూ మాణిక్యరావు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 12ఏళ్లపాటు శాసనమండలి సభ్యులుగా పనిచేసి ఎయిడెడ్ అధ్యాపకులకు వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ సమస్యలను పరిష్కరించారన్నారు. అనంతరం ఎం.జె.మాణిక్యరావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎం.జె.మాణిక్యరావు స్మారక మెరిట్ స్కాలర్ షిప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.వుల్లయ్య అధ్యాపకులు జీ.వి.సుబ్బారెడ్డి, చలమారెడ్డి, బాలగొండ గంగాధర్, కళాశాల కరస్పాండెంట్ శివవిష్ణుమోహన్‌రెడ్డి, వివిధ జిల్లాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో తెలుగు పండితులకు అన్యాయం



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న పాలెంమహేష్, తదితరులు

కడప ఎడ్యుకేషన్: మున్సిపల్ పాఠశాలల్లో పండితుల పదోన్నతుల విషయంలో కొందరికి అన్యాయం జరిగిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ 2017 ఫిబ్రవరిలో పదోన్నతి పొందిన తెలుగు, హిందీ, ఉర్దూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులను హైకోర్టు ఉత్తర్వుల మేరకు రద్దుచేసి కామన్ సీనియార్టీ ద్వారా రీ కౌన్సిలింగ్ నిర్వహించారని తెలిపారు. అయితే రీకౌన్సిలింగ్ ద్వారా ఐదుగురు తెలుగు ఉపాధ్యాయులు, ఒక ఉర్దూ, ఒక హిందీ ఉపాధ్యాయుడు పదోన్నతులు కోల్పోయారన్నారు. వారంతా గత ఆరేళ్లుగా పదోన్నతి పోస్టులో పనిచేసినా కౌన్సిలింగ్‌లో అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. వారి సర్వీసు, వేతనాలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కరీముల్లా, బత్తుల చంద్రశేఖర్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

18న అల్గారిథమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈ నెల 18, 19న పైథాన్ ఫర్ డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ అల్గారిథమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. భారత ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక విద్యా మంత్రిత్వ శాఖ, స్టార్ డీబీటీ సహకారంతో జరిగే ఈ శిక్షణకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అంశాలకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, డీబీటీ కన్వీనర్ డా.వై.సావిత్రి, ప్రోగ్రాం కన్వీనర్ వై.అనిత, మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, రామచంద్ర, సంపత్‌కుమార్, మహబూబ్ సుబానీ, వీరారెడ్డి, గోవర్ధన్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రిలీవ్ చేయాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజుకు వినతి పత్రం సమర్పిస్తున్న శ్రీనివాసులు

కడప రూరల్: రీ డిప్లొమెంట్ ఏఎన్ఎంలను రిలీవ్ చేయాలని ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజును శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల ప్రకారం గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే రిలీవ్ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 175 మంది రీ డిప్లొమెంట్ ఏఎన్ఎంలను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ పురుషోత్తంనాయుడు, పాల్గొన్నారు.

ప్రమాదంగా మ్యాన్‌హోల్



పాత కడపలో రహదారి మధ్యలో మ్యాన్‌హోల్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాత కడప చర్చి ఎదురుగా ఏర్పాటుచేసిన మార్గ బిలం ప్రమాదంగా మారింది. మ్యాన్‌హోల్ గ్రిల్ పూర్తిగా విరిగింది. ఈ మార్గంలో విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆదమరిచి మార్గబిలంలో పడితే ప్రమాదం జరగక తప్పదు. నగరపాలక అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై గ్రిల్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



చిత్రపటాలకు పూలమాల వేస్తున్న సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్, స్వామి వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో రాజులకు మాత్రమే పరిమితమైన గ్రంథాలయాలు ఉద్యమ కారుల ఫలితంగా నేడు గ్రామ గ్రామాన వెలసి ఉన్నాయన్నారు. ఉద్యమకారుల జీవిత చరిత్రలను విద్యార్థులకు వారు వివరించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ రోజూ గ్రంథాలయంలో ఓ గంట చదవాలని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి నాగాంజలి, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పీర్ దర్గా వద్ద ఉరుసు సందడి

ముస్లింలు అతి పవిత్ర ప్రదేశంగా భావించే కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల సందడి మొదలైంది. ఏటా ఈ ఉత్సవాలను ముస్లిం మత పెద్దలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి అనేకమంది ముస్లింలు ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడకు వచ్చి మొక్కులు తీర్చుకుంటే అన్ని కోరికలు నెరవేరుతాయన్నది భక్తుల నమ్మకం. అంతేకాకుండా ఎంతోమంది ప్రముఖులు కడప దర్గాను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దర్గా ఆవరణలో వేచియున్న భక్తులు



దర్గాలో డీఐజీ అమ్మిరెడ్డి, పోలీస్ అధికారులు



దర్గా వీధులు కిటకిట



వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కడపకు చేరిన భక్తి చైతన్య మహాయాత్ర





కర్నూలు నుంచి బయలుదేరిన భక్తి చైతన్య మహాయాత్ర కడపకు చేరింది. ఐదు రోజుల కిందట కర్నూలులో యాత్ర ప్రారంభం కాగా.. శనివారం కడపకు చేరింది. భక్తులు, మహిళలు రథానికి పూజలు జరిపారు. తిరుమలకు 21న చేరుతుందని భక్తులు తెలిపారు.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

కనుల పండువగా కోటి దీపోత్సవం



కోటీ దీపోత్సవ కార్యక్రమానికి హాజరైన భక్తులు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం ఘనంగా జరిగింది. శనివారం రాత్రి ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ దంపతుల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వార్లను మాడ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



జలాధి వాసం పూజల్లో పాల్గొన్న అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు



కలశాలను తీసుకుని వస్తున్న దంపతులు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయస్వామి, గ్రామదేవత గంగమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీ ఎస్ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు పర్యవేక్షణలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో వేద పండిత బృందం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మొదట గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. రక్షాబంధనం అనంతరం యాగశాల ప్రవేశం చేసి వాస్తు మండలారాధన, వాస్తు హోమాలను నిర్వహించారు. ద్వారతోరణ పూజలు నిర్వహించి అఖండ దీప స్థాపన చేశారు. సాయంత్రం పుట్ట వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి మట్టిని తీసుకుని వచ్చి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిష్టకు సిద్ధంగా వున్న గణపతి, శ్రీ దత్తాత్రేయస్వామి, శ్రీ గంగమ్మతల్లి విగ్రహాలతోపాటు వారి వాహనాలు, ఉత్సవ విగ్రహాలను ధాన్యం నుండి బయటకు తీసి జలాధి వాసం నిర్వహించారు. మల్లేశ్వరమ్మ,శంకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.